

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 33 పుష్పం : 39,40 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-4-99, ఐ.భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు శంకరాచార్యుల వారి జయంతి. శంకరాచార్యులవారు కాలడి అనే గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి శివగురువు, తల్లి ఆర్యాంబ. వారికి చాలాకాలం సంతానం లేదు. సంతానం కోసం శివుడిని ప్రార్థించారు. శివుడి అనుగ్రహం వలన ఆయన జన్మించారు అందువలన ఆయనకు శంకరుడు అని పేరుపెట్టారు. ఆయన చిన్నతనంలోనే చాలా విద్యలు గ్రహించారు. ఆయన విద్యాస్వరూపుడు. ఆయన 32 సంవత్సరాలు దేశం అంతా తిరిగి బోధించారు. మీరు యజ్ఞాలు, యాగాలు, మంత్రాలు ఎన్ని చేసినా ఇవి మనస్సు శుద్ధికోసమే గాని అంత మాత్రంచేత ఆత్మజ్ఞానం కలుగదు, అజ్ఞానం నశిస్తేనే గాని ఆత్మజ్ఞానం కలుగదు అని ఆచార్యులవారు చెప్పారు. దేహప్రారబ్దమును బట్టి మీకు ఐశ్వర్యం రావచ్చు, అధికారం రావచ్చు ఇవి అన్నీ నీటి మీద ఉన్న బుడగల లాంటివి. నీటి మీద ఉన్న బుడగలు ఎంతకాలం ఉంటాయి? మన ఐశ్వర్యం అంతే, మన ఆరోగ్యం అంతే. ఈరోజు బాగున్నాము రేపు ఎలా ఉంటామో చెప్పలేము. ఈ భౌతికమైన విషయాలు చూసి మీ మొఖంలోగాని, మీ మనస్సులో గాని అవినయం తెచ్చుకోవద్దు.

జీవుడికి అనుభవించవలసిన ప్రారబ్దం లేకపోతే ఈ భూమి మీదకు రాడు. శరీరం వచ్చింది అంటే ఏదో ప్రారబ్దం ఉంది. అది మంచి ప్రారబ్దంకావచ్చు. చెడు ప్రారబ్దం కావచ్చు, మిశ్రమ ప్రారబ్దంకావచ్చు,ప్రారబ్దాన్ని సహనంతో అనుభవించు, దుఃఖపడవద్దు. మనం బాధలు పడుతున్నాము వారికి బాధలు లేవు అని ఇలా అనుకోవద్దు. ఎవరి బాధలు వారికి ఉంటాయి. కొంతమంది నిగ్రహించుకొంటారు. కొంతమంది నిగ్రహించుకోలేరు. ఆ ప్రారబ్దం ఎలా పోతుంది అంటే ఎవరి వలన నీకు నష్టం వస్తోందో, ఎవరి వలన నీవు ఇబ్బందులకు గురి అవుతున్నావో వారికి ప్రతిక్రియ చేయకు. ఎవరైతే నీకు చెడ్డ చేస్తున్నారో వారి మీద కక్ష తీర్చుకొందామని ప్రయత్నం చేయకుండా నీవు కనుక శాంతిగా ప్రారబ్దాన్ని అనుభవిస్తే ప్రారబ్దం నెమ్మదిగా ఖర్చుఅయిపోతుంది, రాబోయే జన్మలు ఉత్తమ జన్మలు వస్తాయి, ఆధ్యాత్మికంగా అభివృద్ధి అయ్యే

జీన్స్ ఉన్న కుటుంబంలో పుడతావు. తరువాత యోగివి, ఋషివి అవుతావు అని స్వామివారు చెప్పారు. వరదలో గడ్డిపరక ఎలా కొట్టుకొని పోతుందో అలాగ రాగద్వేషముల వేగంలో జీవుడు కొట్టుకొని పోతున్నాడు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా ఎవడూ ఇందులోనుండి బయటకు రాలేడు. ఏ ఉపాధి వచ్చినా అంటే మానవశరీరంలో ఉన్నా, జంతుశరీరంలో ఉన్నా నా మనస్సు నిరంతరము నీ పాదాలు విడిచిపెట్టకుండా అనుగ్రహించు అని భగవంతుని ఆచార్యులవారు ప్రార్థించారు. ఏ ప్రాంతంలో ఉన్నా, ఏకులంలో పుట్టినా, ఏరంగు బట్టలు వేసుకున్నా ఓ శంకరా! నా మనస్సు నీ పాదాలయందు నిలబడి ఉండాలి కదా, అప్పుడు కదా విషయ వాసనలు నశించేది. అలా లేనప్పుడు ఎక్కడ ఉంటే ఏమి ఉంది? ఏమిబట్టలు వేసుకొన్నా నాకు మోక్షం ఎలా వస్తుంది అన్నారు ఆచార్యుల వారు.

శంకరాచార్యులవారు మీరు రాకముందు హిందూమతంలో ఐకమత్యం లేదు. శివుడిని ఆరాధించే వారు శివుడు ఒక్కడే దేవుడని, విష్ణువును ఆరాధించే వారు విష్ణువు ఒక్కడే దేవుడని ఇలా బేధాలు ఉండేవి. ఆచార్యుల వారు ఏమి చెప్పారు అంటే భగవంతుడే విష్ణువుగా వచ్చాడు, భగవంతుడే శివుడిగా వచ్చాడు, భగవంతుడే గణపతిగా వచ్చాడు. ఇన్ని రూపాలలో వచ్చినవాడు భగవంతుడే. మీకు ఇష్టమైన రూపాన్ని ఆరాధించుకోండి. ఏరూపాన్ని ఆరాధించినా భగవంతుడిని పొందుతారు. ఇందులో బేధం ఏమీ లేదు. ఉన్న వస్తువు ఒక్కటే. ఆ వస్తువే ఇన్ని రూపాలుగా వచ్చింది అని చెప్పారు. ద్వైతంలో నుండి కామం పుడుతుంది, ద్వైతంలో నుండి కోరిక పుడుతుంది, ద్వైతంలో నుండి భయం వస్తుంది. అంతా ద్వైతంలో నుండే వస్తుంది. మాయ అంతా ఇక్కడే ఉంది. దేహానికి పరిమితమైన బుద్ధి ఉన్నంతకాలం స్వార్థపూరితమైన కోరికలు పుడతాయి. ఆ కోరికలు నెరవేర్చుకోవటానికి ప్రయత్నిస్తాము. కోరికలు నెరవేరతాయి దాని వలన స్వార్థం పెరుగుతుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా ఈ విషవలయంలోనుండి బయటపడలేము. ధ్యానం అంటే ఉదయం స్నానంచేసి కొద్దిసేపు ఎక్కడో ఒకచోట మొద్దబ్బాయిలా కూర్చోవటంకాదు. ఏనిమిషానికి ఆ నిమిషం నీ మనస్సులో ఏమిజరుగుతోందో, ఏ విధమైన తలంపులు వస్తున్నాయో నిఘావేసి ఉంచటమే ధ్యానం.

శంకరాచార్యులవారు 32 సంవత్సరాలు జీవించారు. అనేక గ్రంథాలు వ్రాసారు. వాహనాలు సరిగా లేని కాలంలో దేశంఅంతా తిరిగి జ్ఞానబోధ చేసారు. విశ్రాంతి లేని జీవితం. శ్రవణంకంటే మననం గొప్పది, మననం కంటే నిధి ధ్యాస గొప్పది. వాటివలన లోపల ఉన్న అజ్ఞానం బయటకు వస్తుంది. ఆత్మజ్ఞానం కలుగుతుంది గాని బాహ్యమైన ప్రక్రియల వలన నీకు ఆత్మజ్ఞానం కలుగదు. విసుగొచ్చేలా శ్రవణం చెయ్యి, శ్రవణం చేసి మననం చేసిన దానిని అనుభవంలోనికి తెచ్చుకొంటే

దాని వలన నీ లోపల ఉన్న అజ్ఞానం బయటకు కక్కబడుతుంది. నిరంతరము ఏదైతే చింతిస్తున్నావో అదే నీవు అవుతావు. ఆచార్యులవారు నాలుగు మఠాలు స్థాపించారు. మఠం యొక్క సాంప్రదాయం ఎలా ఉండాలి, ఏ మఠం ఏవేదాన్ని పరాయణం చెయ్యాలి ఎలా ప్రచారం చేయాలి అనేది వివరంగా చెప్పారు. మీ అనుష్టానం మీరు చేసుకొంటూ ఎవరి ప్రాంతంలో వారు వేదాలను, జ్ఞానాన్ని బోధించి ప్రజలను జ్ఞాన వంతులను చేయండి, వారు మీకు కావలసిన అన్న వస్త్రాలు లోటు లేకుండా చూస్తారు అని శిష్యులకు చెప్పారు. ఆచార్యులవారు కాలడిలో శరీరం ధరించారు, కేధారీనాథ్‌లో శరీరం విడిచిపెట్టారు. ఆయన శరీరం విడిచిపెట్టే రోజు శిష్యులతో మీరు ఇచ్చిన మంచినీళ్ళకు , మీరు పెట్టిన అన్నానికి నా కృతజ్ఞతలు తెలియపరుస్తున్నాను అని చెప్పారట. అప్పుడు పద్మపాదుడు అంటాడు మీరు జీవితం పొడుగునా బోధించారు, బోధించటమే కాదు మీరు ఏదైతే బోధించారో అందులో మేము నిలబడేటట్లు అనుగ్రహించారు. బాహ్యంగా మేము చేసిన పనులకు మీరు కృతజ్ఞత తెలియజేస్తున్నారు. ఇంతచేసిన మీకు మేము ఎలా కృతజ్ఞత చెప్పాలి అన్నాడు. కృతజ్ఞత లేని మానవుడు ఎన్ని పూజలు చేసినా, జపాలు చేసినా, తపస్సులు చేసినా ఈశ్వరానుగ్రహానికి అర్హుడు కాడు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు,18-3-99, సూరత్)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పనేదేవుడు. పనిద్వారామనం నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. పనిమానేస్తే సోమరితనం వస్తుంది గాని మోక్షం రాదు. కష్టపడి పని చెయ్యాలి. ఫలితం ఈశ్వరుడికి విడిచిపెట్టాలి. ఫలితం ఎప్పుడు ఎక్కడ ఎలా ఇవ్వాలో ఈశ్వరుడు మనకు ప్రసాదిస్తాడు. మన చేతిలోపని ఉంది. కష్టపడి పని చేసుకోవాలి. ఫలితం కోసం ఎదురుచూడవద్దు. మీరుచేసే కృషికి అందరికీ ఫలితం వస్తుంది. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను వ్యర్థం చేసుకోకూడదు, వాటిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలి. కొంత స్వార్థం తగ్గించుకొని భగవంతుడు ఇచ్చిన అవకాశములను కొంతవరకు సమాజానికి ఉపయోగిస్తే సమాజం బాగుపడుతుంది, భగవదనుభవం పొందటానికి అది మీకు సహకరిస్తుంది. మానవుడు ఏరంగంలో అయినా బాగుపడాలంటే పని, క్రమశిక్షణ, భక్తి ఇవి మూడూ అవసరం. ఈ మూడూ అభ్యాసం చెయ్యండి. అభ్యాసం చేస్తే అసాధ్యం అంటూ ఏమీలేదు. మీరు సంపాదించిన దానిలో మీరు ఎంజాయ్ చేస్తూ కొంతభాగాన్ని ఇతరులకు ఉపయోగించండి. ఇతరులకు ఇచ్చినది దేవుని బాంక్‌లో పడుతుంది. అది మీ మరణానంతరజీవితంలో మీకు